శ్రీనివాస నగర్(ఈస్ట్‌లో)

ప్రమాద ఘంటికలు

- తుప్పు పట్టి రోడ్డు వైపు ఒరిగిన 11 కేవీ విద్యుత్ స్థంభం
- ప్రత్యమ్నాయ స్థంభం ఏర్పాటు చేసి మూడు నెలలు
- ప్రారంభం కాని పునరుద్ధరణ పనులు ● భయందోళనలో అపార్ట్‌మెంట్ వాసులు

అమీర్‌పేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట శ్రీనివాస నగర్ (ఈస్ట్) కౌశిక్ సాయిరామ అపార్ట్‌మెంట్ ఎదుట ఫుట్‌పాత్‌పై 11 కేవీ విద్యుత్ స్తంభం తుప్పు పట్టి ఒకపక్క వంగిపోయింది. కొద్దిపాటి గాలివీచినా ఊగిపోతోంది. ఈ హైటెన్షన్ విద్యుత్‌స్థంభం మూలంగా ప్రమాద ఘంటికలు పొంచి ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం అంచున ఉన్న ఈ స్థంభం మార్చాలని పలుమార్లు చేసిన ఫిర్యాదు మేరకు ప్రత్యమ్నాయంగా దీని పక్కనే సిమెంట్ విద్యుత్ స్థంభం మూడు నెలల క్రితం ఏర్పాటు చేసినప్పటికీ పునరుద్ధరణ పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్థంభానికి దట్టంగా కట్టిన కేబుల్ వైర్ల సపోర్టుతోనే కింద పడిపోకుండా నిలబడుతోంది. ఈ స్థంభం కిందిభాగం మధ్యలో తుప్పు పట్టి రంధ్రం ఏర్పడింది. ఏ పరిస్థితుల్లోనైనా కేబుల్ వైర్లు తొలగించినా, భారీ గాలి వీచినా ఎదురుగా ఉన్న కౌశిక్ సాయిరామ అపార్ట్‌మెంట్‌పై కూలిపోయే ప్రమాదం ఉందని నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్థంభానికి 11 కేవీ వైర్లను బిగించాలని పలువురు కోరుతున్నారు.



విద్యుత్ స్థంభం కిందిభాగంలో తుప్పు పట్టి ఏర్పడిన రంధ్రం



శ్రీనివాసనగర్(ఈస్ట్)లో తుప్పు పట్టి రోడ్డు వైపు ఒరిగిన 11 కేవీ విద్యుత్ స్థంభం

వంగిపోయిన విద్యుత్ స్థంభం

కౌశిక్ సాయిరామ అపార్ట్‌మెంట్ ఎదుట ఉన్న రోడ్డుపై విద్యుత్ స్థంభం వంగిపోయి నెలలు గడుస్తుంది. అపార్ట్‌మెంట్ వాసులు చేసిన ఫిర్యాదుల మేరకు అధికారులు దీని పక్కనే అదనపు స్థంభం ఏర్పాటు చేసి సుమారు మూడు నెలలు దాటింది. చిన్నపాటి గాలికే ఈ స్థంభం ఊగుతుండడంతో పాదచారులు, వాహనదారులు, అపార్ట్‌మెంట్ వాసులు భయపతున్నారు.

మీనాక్షి శంకర్ రావు, కౌశిక్ సాయిరామ అపార్ట్‌మెంట్ నిర్వాహకుడు

భయంతో పనులు చేయాల్సి వస్తుంది

విద్యుత్ స్థంభం గాలికి ఊగిపోతూ మంటలు వస్తుండడం వల్ల భయంతో పనులు చేయాల్సి వస్తుంది. ఈ స్థంభం అమాంతంగా కూలిపోతే ముందుగా నేను పనిచేస్తున్న కౌశిక్ సాయిరామ అపార్ట్‌మెంట్ మీద పడే అవకాశం ఉంది. వర్షం పడితే చాలు రాత్రివేళ కంటిమీద కునుకు ఉండడం లేదు. ఇది కూలిపోతే, ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. వెంటనే ఈ స్థంభాన్ని తొలగించి ప్రత్యమ్నాయంగా ఏర్పాటు చేసిన స్థంభానికి విద్యుత్ వైర్లను బిగించాలి.

ఈ.వీరబాబు, అపార్ట్‌మెంట్ వాచ్‌మన్

రహదారి గేటు కూల్చివేత



సిటాడెల్ బ్రిగేడ్ పక్కన రహదారి గేటును కూల్చివేస్తున్న దృశ్యం

ఎర్రగడ్డ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మీటర్ ఫ్యాక్టరీ రోడ్డులోని బ్రిగేడ్ సిటాడెల్ అపార్ట్‌మెంట్స్ పక్కన రహదారి గేటును జీహెచ్ఎంసీ సిబ్బంది సోమవారం హుటాహుటిన కూల్చడంపై అపార్ట్‌మెంట్‌వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కొంతసేపు స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. బ్రిగేడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన ఈ ప్రైవేట్ స్థలాన్ని రహదారి కోసం గతంలో జీహెచ్ఎంసీకి ఇవ్వడం జరిగిందన్నారు. భరత్‌నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కిందగా రోడ్డుకు అనుసంధానం చేసే ఒప్పందంతో ఈ స్థలాన్ని కేటాయించామని బ్రిగేడ్ సిటాడెల్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు విష్ణువర్ధన్, ప్రతినిధులు తెలిపారు. సోమవారం సాయంత్రం బ్రిగేడ్ సిటాడెల్, కల్పతరు తదితర అపార్ట్‌మెంట్లకు చెందిన ప్రతినిధులు కూల్చిన గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జి కిందగా రోడ్డును వేయనప్పటికీ, ప్రస్తుతం తాము కేటాయించిన గేటును కూల్చి ఇతరత్రా అవసరాల కోసం వినియోగించుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. మీటర్ ఫ్యాక్టరీ నుంచి ఎర్రగడ్డ బ్రిడ్జి వైపు వెళ్లేందుకే ఈ స్థలాన్ని వినియోగించాలని, వెనక ఖాళీ స్థలంలో ఇతర అవసరాల కోసం అపార్ట్‌మెంట్ల పక్కన రోడ్డును వినియోగిస్తే ఒప్పుకోమని పేర్కొన్నారు.



పుట్టిన రోజు సందర్భంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గజమాలతో సత్కరిస్తున్న బేగంపేట కార్పొరేటర్ దంపతులు టి.మహేశ్వరిశ్రీహరి *బేగంపేట, ఆంధ్రజ్యోతి*



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న సనత్‌నగర్ కార్పొరేటర్ దంపతులు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి *బేగంపేట, ఆంధ్రజ్యోతి*



సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసానికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి, శ్యామల కుంటబస్తీ అధ్యక్షుడు పుట్టల శేఖర్ *బేగంపేట, ఆంధ్రజ్యోతి*

సర్దార్ కుటుంబానికి బీఆర్ఎస్ అండ

బోరబండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ బోరబండ డివిజన్ నాయకుడు దివంగత మహ్మద్ సర్దార్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు బోరబండ ఎస్ఆర్టీ నగర్‌లోని సర్దార్ కుటుంబాన్ని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి తో కలిసి సోమవారం వారు పరామర్శించారు. అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణం కోసం రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బోరబండ డివిజన్‌లో బీఆర్ఎస్ బలోపేతానికి పాటుపడిన సర్దార్ ఇంటి నిర్మాణం చేపడుతుంటే కాంగ్రెస్ నాయకులు కక్ష పూరితంగా కూల్చివేయించడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్దార్ కుటుంబసభ్యులకు రూ.3లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద

మధురానగర్ కాలనీతో ఎంతో అనుబంధం

- ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు

వెంగళరావునగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీతో తనకు ఎంతో అనుబంధం ఉందని, 45 సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి చెందిందని ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నర్సింహారావు అన్నారు. మధురానగర్ సంక్షేమ సమితి 45వ వార్షికోత్సవం, మహాత్మా గాంధీ 156వ జయంతిని స్థానిక సాగి రామకృష్ణం రాజు కమ్యూనిటీ హాల్లో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్ దేదీప్య, సమితి ప్రతినిధులతో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. సమితి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనేక సేవలను కాలనీ వాసులకు అందుబాటులోకి తెచ్చారని ఆయన అన్నారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తాను ఈ కాలనీవాసులను కుటుంబసభ్యులుగా భావించే వారమని కార్పొరేటర్ దేదీప్యవిజయ్ అన్నారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'పాప దొరికింది' హాస్య నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో సమితి ఇన్‌చార్జి అధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, కోశాధికారి సుగుణ, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కళాకారులను సన్మానిస్తున్న ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, మధురానగర్ సంక్షేమ సమితి ప్రతినిధులు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేదీప్యవిజయ్

సమస్యలను పరిష్కరిస్తా : దేదీప్య

వెంగళరావునగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని మధురానగర్, సిద్ధార్థ నగర్, వెంగళరావునగర్, కళ్యాణ్ నగర్-1 కాలనీల్లో 18 సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మధురానగర్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, సిద్ధార్థనగర్ కాలనీ అధ్యక్షుడు విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ శ్యామ్ ముదిరాజ్, విజయ్ ముదిరాజ్, సత్యనారాయణ, బాలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



షేక్‌పేటలో పాదయాత్ర చేస్తున్న విజయలక్ష్మి

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

బంజారాహిల్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి అన్నారు. షేక్‌పేటలో ఆమె సోమవారం పాదయాత్ర చేశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్‌కే పట్టం కట్టాలని కోరారు.

మంత్రి అడ్లూరిపై పొన్నం వ్యాఖ్యలు దురదృష్టకరం

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

పంజాగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఆయన మాదిగ జాతికి, మంత్రి లక్ష్మణ్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మాదిగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదిక రాష్ట్ర నాయకులు ఇటుక రాజు మాదిగ, ఎం.విజయ్ కుమార్, జి.యాదయ్య, బి.వెంకటేష్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. సురేందర్, దామోదర్, మహేష్, భారతక్క చేసిన త్యాగాలతోనే వర్గీకరణ ఉద్యమం కొనసాగిందన్నారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. 50 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో పాల్గొన్న చాలామందిపై కేసులు ఉన్నాయని, 30 సంవత్సరాలుగా వారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, కేసులను కొట్టేయాలని అన్నారు. సమావేశంలో వేదిక నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

8, 9, 10వ తేదీల్లో అమృత ఉత్సవాలు

పంజాగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం అక్టోబరు 8, 9, 10వ తేదీల్లో ఇందిరాపార్కు పక్కనే ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో గురుదేవులు శ్రీ అమృతానందనాథ సరస్వతి గారి దివ్య ఆశీస్సులతో ఆయన శిష్యురాలు వేణుశ్యామ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అమృత ఉత్సవాలు-2025 నిర్వహిస్తున్నామని కామాఖ్యామృత శోధన సంస్థ అధ్యక్షుడు కేవీవీ సతీష్ బాబు, కార్యదర్శి ప్రసన్న కుమార్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు కరపత్రాన్ని ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. గురుదేవులు శ్రీ అమృతానందనాథ సరస్వతి వారు అమ్మవారిలో కలిసి పది సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 8న సాయంత్రం 5 గంటల నుంచి ఆనంద గళ లలితామృతం, సామూహిక లలితాసహస్రనామ పారాయణం, 9న 108 అడుగుల శ్రీ చక్రంతో అష్టోత్తర సిరిజ్యోతి పూజ ఉంటుందని తెలిపారు. మొదటి రెండు రోజులు ప్రవేశం ఉచితం అని, పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 10న 1008 హోమ కుండాలతో లోక కళ్యాణార్థం అనంత అమృత చండీహోమం జరుగుతుందని తెలిపారు. దీనికి నామ మాత్ర రుసుము ఉంటుందని తెలిపారు.

కుటుంబ వ్యవస్థను కాపాడుకునేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఖైరతాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశ కుటుంబ వ్యవస్థ చాలా పటిష్టమని, దానిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని ఆర్ఎస్ఎస్ వానవాసి పరిషత్ అఖిల భారత ప్రశిక్షణ టోలి సభ్యుడు కె.రామచంద్రయ్య అన్నారు. ఖైరతాబాద్ జైన్ మందిరంలో ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా సోమవారం జరిగిన విజయ దశమి ఉత్సవానికి ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం మూడుసార్లు నిషేధానికి గురైనా, కార్యకర్తల బలంతోనే ఈ స్థాయికి చేరిందని అన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పంచ పరివర్తనం పేరిట కుటుంబ ప్రభోదన్ స్వచ్ఛత, స్వదేశీ, పర్యావరణం, పౌర విధులు అనే అంశాలపై జాగరణ చేయనున్నట్లు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ స్వదేశీ వస్తువులనే వినియోగిస్తూ దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోల్కొండ భాగ్ సంఘచాలక్ కొండా శ్రీకాంత్, మల్లికార్జున్, రమేష్‌గుప్తా, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ సువిర్ జీ పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్‌లో టీఏజేఎఫ్ విలీనం

పంజాగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల హక్కుల సాధన, జర్నలిజం విలువల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)లో తమ సంఘాన్ని విలీనం చేస్తున్నట్లు తెలంగాణ ఆల్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీఏజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీఏజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రఘురాం, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ రాజేందర్, జాతీయ కన్వీనర్ కూసం సారంగపాణి తదితరులు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న తమ సంఘం సభ్యులంతా టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరుతారని తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులు తీరని అన్యాయానికి, అవమానాలకు గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఆనందం, వి.జగన్, బి.విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఎం.మధు, వెంకటస్వామి, ఎం.గోపాల్, నాంపల్లి శ్రీనివాస్, సంజీవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన శివధర్‌రెడ్డిని తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. డీజీపీని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల అశోక్, ఉపాధ్యక్షులు అశోక్ కుమార్, జి. హరిబాబు, జాయింట్ సెక్రటరీ నారాయణరెడ్డి ఉన్నారు.



పతకాలతో క్రీడాకారులు

చెస్ విజేత రమ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో ఎ.రమ్య విజేతగా నిలిచింది. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో అండర్-15 విభాగంలో రమ్య టైటిల్ దక్కించుకోగా, కె.ఇందిర రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇదే విభాగంలో బాలురలో చరణ్‌తేజ విజేతగా, అనయ్ రన్నరప్‌గా నిలిచారు. అండర్-9 బాలుర విభాగంలో జితిన్ టైటిల్ కైవసం చేసుకోగా, అక్షజ్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. ఇదే విభాగంలో సారిక విజేతగా, రిషిక రన్నరప్‌గా నిలిచారు. రాష్ట్ర చెస్ సంఘం ఉపాధ్యక్షురాలు టి.పుణ్యవతి, కోశాధికారి నరసింగ్‌రావు విజేతలకు పతకాలు ప్రదానం చేశారు.



వైద్యులకు ప్రసంసా పత్రం అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర

గాంధీలో కార్పొరేట్ స్థాయి వైద్యం

- సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర
- ఆపరేషన్ థియేటర్లు ప్రారంభం

అడ్డగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో పేద రోగులకు చేయూతను అందించాలనే లక్ష్యంతో అర్బన్ రోగి సహాయత స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం సంతోషకరమైందని గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. సోమవారం గాంధీ ఆస్పత్రిలో రూ.39 లక్షల వ్యయంతో ఆర్థోపెడిక్‌తో పాటు ముఖ్యమైన విభాగాల్లో నూతన వైద్య యంత్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాల్లో ఆపరేషన్ థియేటర్లకు మరమ్మతులు చేసి ఆధునికీకరించి ప్రారంభోత్సవం చేశామన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి యంత్రాలను ప్రారంభించామన్నారు. గాంధీ ఆస్పత్రికి వచ్చే రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నామని, వైద్యులు క్రమశిక్షణతో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. కార్యక్రమంలో గాంధీ ఆర్ఎంఓ శేషాద్రి, దేవేందర్ మోహత, వినయ్ సురాన, విమల బద్రుకా, వీణా జైన్, ప్రెమల్ పరేక్ పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా నేడు సంతకాల సేకరణ

సికింద్రాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా మంగళవారం సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ తెలిపారు. మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాలంరాయి చౌరస్తాలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోలీసుల అదుపులో
నకిలీ డాక్టరేట్లను ప్రదానం చేస్తున్న వ్యక్తి

ఖైరతాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం, కళల రంగాల్లో గౌరవ డాక్టరేట్లు అందిస్తామని నమ్మబలికి ఏడుగురికి నకిలీ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఒక వృద్ధుడిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం... గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ అనే ఒక సంస్థను స్థాపించి ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన పెద్దేటి యోహాన్(75) చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కళలు, సాహిత్య రంగాల అభివృద్ధికి తమ సంస్థ కృషి చేస్తుందని తెలుపుతూ ఈ రంగాల్లో ప్రతిభ ఉన్నవారికి గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేస్తామని నమ్మబలికి పలువురి నుంచి సభ్యత్వం పేరిట డబ్బులు వసూలు చేశాడు. ఏడుగురికి డాక్టరేట్లు ప్రదానం చేస్తామని ఆదివారం రవీంద్రభారతి మినీ హాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. ఈ విషయమై పక్కా సమాచారంతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి సర్టిఫికెట్లు పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. ఇతడు గతంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరికొందరికి ఇలాంటి నకిలీ సర్టిఫికెట్లు అందించాడని పోలీసులు నిర్ధారించారు. డాక్టరేట్లు అందుకోవడానికి వచ్చిన వారు సైతం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారేనని, దీని వెనక ఎవరున్నారు? సర్టిఫికెట్ల తయారీ విషయమై అన్ని కోణాల్లో విచారిస్తున్నామని ఎస్ఐ నవీన్ తెలిపారు.

భర్త అంతిమ సంస్కారాలకు వెళ్లి వచ్చేసరికి
బంగారం, నగదు మాయం

బంజారాహిల్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భర్త అంతిమ సంస్కారాల కోసం ఊరెళ్లి తిరిగి వచ్చేసరికి బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు మాయమయ్యాయి. షేక్‌పేటకు చెందిన చిరంజీవులు రియల్ ఎస్టేట్ వ్యాపారి. గత నెల 11న అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో భార్య చింతకోట్ల స్వప్న అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు అత్తవారింటికి వెళ్లింది. సెప్టెంబరు 27న తిరిగి ఇంటికి వచ్చి శుభ్రం చేసుకొని మళ్లీ అత్తారింటికి వెళ్లిపోయింది. ఈనెల 4న ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉండాల్సిన 43 తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన కిషన్(31) కార్మికనగర్ సాయిబాబా ఆలయ సమీపంలో దినసరి కార్మికుడిగా పనిచేసుకుంటూ మిత్రుడితో కలిసి ఉంటున్నాడు. ఆదివారం అనారోగ్యానికి గురి కావడంతో స్నేహితుడు షేక్ అలీ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని మృతుడి బంధువు విజయ్‌సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

10న సాలూరి పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక గాయకుడు శ్రీనివాస్ యాదవ్‌కు ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు పురస్కారాన్ని ఈనెల 10న త్యాగరాయగానసభలో బహూకరిస్తున్నట్లు రసమయి సంస్థ అధ్యక్షుడు డా.ఎంకే రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాన్ని బహూకరిస్తారని ఆయన పేర్కొన్నారు. సాలూరి రాజేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.



అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ గణేశ్

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

మారేడుపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీవాసులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మించడానికి శ్రీకారం చుట్టినట్లు కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డ్ నాలుగో వార్డ్ పరిధిలోని ఎల్‌విసీ కాలనీలో రూ.30లక్షలతో బోర్‌వెల్ పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, సహకారంతో నియోజకవర్గానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ తీసుకువచ్చి అభివృద్ధి చేసుకుంటున్నామని చెప్పారు. తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎక్కడికక్కడ బోర్‌వెల్స్ వేయిస్తున్నామని, అలాగే కాలనీ వాసులు ఫంక్షన్లు, మీటింగ్‌లు పెట్టుకోవడానికి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కిషన్‌రావు, బోర్డు నాలుగో వార్డ్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ నాయకులు, వెంకటేష్, సురేఖ, టెంపుల్ కమిటీ చైర్మన్ సాంబశివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీలో కార్పొరేట్ స్థాయి వైద్యం

- **సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర**



వైద్యులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర

అడ్డగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో పేద రోగులకు చేయూతను అందించాలనే లక్ష్యంతో అర్చన్ రోగి సహాయత స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం సంతోషకరమైందని గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. సోమవారం గాంధీ ఆస్పత్రిలో రూ.39 లక్షల వ్యయంతో ఆర్థోపెడిక్‌తో పాటు ముఖ్యమైన విభాగాల్లో నూతన వైద్య యంత్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాల్లో ఆపరేషన్ థియేటర్లకు మరమ్మతులు చేసి ఆధునీకరించి ప్రారంభోత్సవం చేశామన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి యంత్రాలను ప్రారంభించామన్నారు. గాంధీ ఆస్పత్రికి వచ్చే రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నామని, వైద్యులు క్రమశిక్షణతో పనిచేస్తున్నారని కితాబి ఇచ్చారు. కార్యక్రమంలో గాంధీ ఆర్ఎంఓ శేషాద్రి, దేవేందర్ మోహత, వినయ్ సురాన, విమల బద్రుకా, వీణా జైన్, ప్రైమల్ పరేక్‌లు పాల్గొన్నారు.

కడారి సురేష్‌కు ఓయూ డాక్టరేట్



కడారి సురేష్

తార్నాక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా నెల్లికొండూరు మండలానికి చెందిన కడారి సురేష్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. ఓయూలోని జియోలజీ విభాగంలో ప్రొ. నర్సింగ్‌రావు పర్యవేక్షణలో జియోలాజికల్ స్టడీస్ టూ ఇవాల్యుయేట్ ఐరన్ ఓర్ మినరలైజేషన్ విత్ స్పెషల్ ఎంఫసిస్ ఆన్ మినరల్ ఎకనామిక్స్ ఇన్ బయ్యారం ఖమ్మం డిస్ట్రిక్ట్ తెలంగాణ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకుగాను డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగిందని సోమవారం ఆయన తెలిపారు. కాగా కడారి సురేష్ డాక్టరేట్ పట్టాను పొందడాన్ని హర్షిస్తూ తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు అభినందించారు.



ఓబన్న చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

ఓబన్న ఆశయ సాధనాల కోసం పనిచేస్తాం

అడ్డగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర బిడ్డ వడ్డే ఓబన్న ఆశయాల సాధన కోసం పనిచేస్తామని వడ్డే వడ్డెర సంఘం రాష్ట్ర నాయకుడు గోగుల స్వామి అన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లో జరిగిన ఓబన్న 179వ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబన్న మాతృభూమి విముక్తి కోసం బ్రిటిష్ పాలకులపై వీరోచితంగా పోరాడిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్యామ్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తుకారాంగేట్‌లో ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కామత్ విద్యార్థులు సూచించారు. సోమవారం తుకారాంగేట్‌లోని షిరిడి సాయిబాబా హైస్కూలులో నిర్వహించిన డాక్టర్ ఆర్య మల్టీ స్పెషాలిటీ కంటి, డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జీఎల్ టీ కో-ఆర్డినేటర్ ఎల్.శ్రీదర్, ఆల్ యూనివర్శిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మహేందర్, బీఎస్పీ నేత నర్సింగ్‌రావు, స్కూలు ప్రిన్సిపాల్ ఎల్.వాసవీలు పాల్గొన్నారు. విద్యార్థులే గాకుండా వారి తల్లిదండ్రులతో పాటు బస్తీవాసులు వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తార్నాక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరై తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడి మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధి సోమవారం తెల్లవారు జామున జరిగింది. నాచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెంగిచర్ల గణేష్ నగర్‌కు చెందిన చెర్యాల దిలీప్ కుమార్(31) ఆదివారం సాయంత్రం స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యేందుకు చెంగిచర్లలోని తన నివాసం నుంచి బయలుదేరి వెళ్లాడు. పుట్టిన రోజు వేడుకలకు హాజరై సోమవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ వైపు నుంచి చెంగిచర్లలోని తన నివాసానికి స్కూటీ (టీఎస్08జీఏ9032) పై బయలుదేరిన దిలీప్ కుమార్ నాచారంలోని ఐఐసీటీ వెనక భాగం గేటు సమీపంలో స్కూటీ అదుపుతప్పి ఫుట్‌పాత్‌పై పడిపోయాడు. పూర్తిగా మద్యం మత్తులో ఉన్న దిలీప్ కుమార్ ఒక్కసారిగి అదుపుతప్పి క్రింద పడటంతో తల వెనుక భాగంలో గాయమై తీవ్ర రక్తస్రావం అయింది. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నాచారం పోలీసులు తెలిపారు.

బస్ షెల్టర్లు నిర్మించండి

అధికారుల నిర్లక్ష్యం.. ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉన్న బస్‌స్టాప్

తిరుమలగిరి అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వెరిసి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. కొన్ని సంవత్సరాలుగా ప్రయాణికుల సౌకర్యార్థం తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉన్న బస్‌స్టాప్‌లో బస్ షెల్టర్‌ను నిర్మించాలని అధికారులకు విన్నపించినా ప్రయోజనం లేదని స్థానికులు అసహనాన్ని వ్యక్తం చేశారు. తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి మొదలుపెడితే కొన్ని ప్రాంతాల్లో బస్‌స్టాపుల వద్ద బస్ షెల్టర్లు లేకపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు వివిధ పనుల నిమిత్తం బొల్లారం వైపు రాకపోకలు కొనసాగిస్తున్న సమయంలోనైనా పరిస్థితులను గమనించి బస్సు షెల్టర్లు నిర్మించాలన్న ఆలోచన కలగకపోవడం బాధాకరం అంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రయాణికుల సంక్షేమంలో భాగంగా తిరుమలగిరి నుంచి మొదలుకుని బొల్లారం వరకు కొన్ని ప్రాంతాల్లో ఉన్న బస్ స్టాపుల్లో బస్సు షెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి



తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉన్న బస్‌స్టాపు నుంచి ప్రతీ రోజు తిరుమలగిరి విలేజ్, ఎస్సీ కాలనీ, వీకర్ సెక్షన్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ బొల్లారం పరిసర ప్రాంతాలకు ఈ బస్‌స్టాపు నుంచే రాకపోకలు కొనసాగిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు షెల్టర్ ఏర్పాటు చేయాలి.

\- రాజారెడ్డి

రాకపోకలకు ఇబ్బంది



వర్షాకాలం, ఎండాకాలంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బస్‌షెల్టర్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక్కడి నుంచి వందలాది మంది బస్సుల ద్వారా రాకపోకలు కొనసాగిస్తుంటారు. అధికారులు చొరవ తీసుకుని బస్‌షెల్టర్ నిర్మిస్తే బాగుంటుంది.

\- ఉమేష్



మర్యాదపూర్వక కలయిక

హోంశాఖ ముఖ్య కార్యదర్శి సి.వి.ఆనంద్‌ను సోమవారం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ హోమియో డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చినుకని శివప్రసాద్ కలిశారు. సహస్ర ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. హోమియో వ్యాధి నివారణ ఔషధాలను సి.వి.ఆనంద్‌కు ఆయన అందించారు. - సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

ఓటు చోరీకి వ్యతిరేకంగా నేడు సంతకాల సేకరణ

సికింద్రాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ తెలిపారు. బాలంరాయి చౌరస్తాలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలి: జూలకంటి

- **సీపీఎం నాయకుల ధర్నా, నిరాహార దీక్ష**
- **ఎలివేటెడ్ పనుల వేగవంతానికై డిమాండ్**



ఉప్పల్ చౌరస్తాలో నిరాహార దీక్ష చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

ఉప్పల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడి ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఉప్పల్ చౌరస్తాలో సీపీఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా, నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నరలో పూర్తి కావాల్సిన ఫ్లైఓవర్ ఏడేళ్లయినా సగం కూడా పూర్తి కాకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఎనిమిది బీజేపీ పార్లమెంటు సభ్యులు కేవలం పరస్పర విమర్శలతో కాలం వెళ్లదీయడం తగదని హితవు పలికారు. పనుల్లో జాప్యం మూలంగా ఉప్పల్ శివారు ప్రాంతాలు, మండలాలతో పాటు వరంగల్ వైపు రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ధర్నాకు మద్దతుగా బీఆర్‌ఎస్, సీపీఐ పార్టీల నాయకులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో పీర్జాదీగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం, నాయకులు జె.చంద్రశేఖర్, కోమటి రవి, వినోద, రాజశేఖర్, ఎం.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు సబితా, రాథోడ్ సంతోష్ శంకర్, లక్ష్మణ్, ఉప్పల్ మండల నాయకులు వెంకన్న, ఎం.డి.గౌస్, అశోక్ రెడ్డి, స్వామి, ఊర్మిళ, నాగరాజు, భీష్మాచారి, ఉపేందర్, రాజు, వెంకటేష్, పట్టాభిరామయ్య, మేడిపల్లి మండల నాయకులు సృజన, కర్ర జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

- **మెట్రో వాటర్‌వర్క్స్ డైరెక్టర్‌కు కార్పొరేటర్ వినతి**

మల్కాజిగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని మెట్రోవాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు ఆపరేషన్స్ అధికారి శ్రీధర్‌ను మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ సోమవారం కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించాలని కోరారు. వాజ్‌పేయ్‌నగర్, చాణుక్యపురి సెక్షన్‌లలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ పనులను మంజూరు చేయాలని కోరారు. చాలా రోజుల క్రితమే సంబంధిత పనులకు అంచనాలు తయారుచేసి వాటర్‌బోర్డు కార్యాలయానికి పంపించామని అన్నారు. పాడైపోయిన మ్యాన్‌హోల్స్ మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందు యాదవ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

భోలక్‌పూర్ ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ముషీరాబాద్ : భోలక్‌పూర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో వాజీద్ హుస్సేన్ వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ భోలక్‌పూర్‌లోని శేఖర్‌రెడ్డి వీధి వెనకభాగంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, దేవీచౌక్ వద్ద అధ్వానంగా మారిన రోడ్లను వెంటనే ఆధునీకరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గాంధీనగర్‌లోని సబర్మతినగర్‌లో వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.



ఇక్రిసాట్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రేంకుమార్

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన

మల్కాజిగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ కాలనీ, తాళ్లబస్తీలలో కార్పొరేటర్ ప్రేంకుమార్ సోమవారం పర్యటించారు. బస్తీ, కాలనీల ప్రజలకు కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ ఏర్పాట్లతో పాటు చాలాచోట్ల చెట్టుకొమ్మలు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని పలువురు తెలిపారు. ఈ సమస్యలపై అధికారులు సిబ్బందితో మాట్లాడిన కార్పొరేటర్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సత్యలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, ఆర్టికల్చర్ సూపర్‌వైజర్ వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు ఉమే ష్‌సింగ్, కిషోర్, స్థానికులు వెంకటరత్నం, అనూరాధ, మైకేల్, కొండయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయం

ముషీరాబాద్, అక్టోబర్ 6(ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడు జి.రాజు, ఎడ్ల హరిబాబుయాదవ్‌ను కలిసి పార్టీ కార్యక్రమాలు, ప్రజాసమస్యల పరిష్కారంపై మాట్లాడారు. ఈ సందర్భంగా హరిబాబుయాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో లేకున్నా ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ ముషీరాబాద్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సదా, సీనియర్ నాయకులు ఎయిర్‌టెల్ రాజు పాల్గొన్నారు.



ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న తలసాని



తలసానికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వంకమామిడి ప్రవీణ్‌కుమార్, పత్తిపాక సంజయ్

ఘనంగా తలసాని పుట్టినరోజు వేడుకలు



తలసానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆనంద్‌పాటిల్

సికింద్రాబాద్, రాంగోపాల్‌పేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషుల నడుమ మాజీమంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ పుట్టిన రోజు వేడుకలు కోలాహలంగా జరిగాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో సోమవారం ఉదయం అమ్మవారికి పూజలు జరిపిన తలసాని వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై ఆయన పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. తలసాని సోదరులు మహేష్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, రవీందర్ యాదవ్ (స్కైలాబ్), రాంగోపాల్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణశ్రీనివాస్‌గౌడ్, ఫెడరేషన్ ఆఫ్ పీజీ రోడ్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ & సొసైటీస్ అధ్యక్ష, కార్యదర్శులు వంకమామిడి ప్రవీణ్ కుమార్, పత్తిపాక సంజయ్, సికింద్రాబాద్ గోల్డ్ & సిల్వర్ రిఫైనర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ పాటిల్ తదితరులు తలసానికి పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. తలసానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి లేఖను పంపారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు తదితరులు తలసానికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న జంపన తదితరులు

కంటోన్మెంట్ ప్రజల సమస్యలు పరిష్కరించండి

సికింద్రాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ మూడో వార్డు ఈద్గా అంబేడ్కర్‌నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కంటోన్మెంట్ బోర్డు ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌కు కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సీఈఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. బస్తీలోని ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థానిక శాసనసభ్యుడు శ్రీగణేశ్ రూ.25లక్షలు కేటాయించారని, అయితే అక్కడ ఉన్న పురాతన మరుగుదొడ్లను తొలగించాలని సీఈఓను కోరారు. కమ్యూనిటీహాలుతోపాటు రెండు టాయిలెట్లు కూడా నిర్మించనున్నట్లు జంపన ప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ ఆషిఖ్ హుస్సేన్, బస్తీవాసులు డాల్ రాజు, ఇటుగ గోపి, అస్గర్, సాబెర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శైలేందర్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు



డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఐఓఎస్‌ల నుంచి అవార్డు అందుకుంటున్న శైలేందర్

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కళాసీగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన శైలేందర్ సికింద్రాబాద్ జోన్‌లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. సోమవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ ఈఓ గుండప్ప, డిప్యూటీ ఐఓఎస్ ప్రసన్న కుమారిలతో కలిసి ఆయనకు అవార్డు ప్రదానం చేసి శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆదయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్మల్ నారాయణ రెడ్డిలతో జోన్‌కు చెందిన పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ

పలు విభాగాల్లో వీసీ ఆకస్మిక తనిఖీ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఆయా కళాశాలలు, విభాగాల్లో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తరగతి గదుల్లోని విద్యార్థులతో ముచ్చటించి, సమయానికి తరగతులు జరుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల విద్యార్థులు తరగతి గదుల్లో కూర్చున్నప్పటికీ అధ్యాపకులు అందుబాటులో లేకపోవటాన్ని గుర్తించారు. అధ్యాపకుల హాజరు పట్టికను పరిశీలించారు. సమయానికి తరగతులకు హాజరుకాని అధ్యాపకులపై, అసలు తరగతులకు రాని అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని, వారి నుంచి వివరణ తీసుకోవాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. అకాడమిక్ ఎక్సలెన్స్ సాధించే దిశగా అధ్యాపకులందరూ సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. విద్యా బోధన, పరిశోధనల్లో చురుగ్గా పాల్గొని ఓయూ సమగ్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వర్సిటీ నుంచి అవసరమైన సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్ ఉన్నారు.

తాళ్ల అజయ్‌కి ఓయూ డాక్టరేట్



డాక్టరేట్‌తో అజయ్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా, చెన్నారావుపేట (రాజీవ్‌నగర్ కాలనీ) గ్రామానికి చెందిన తాళ్ల యాకయ్య, కరుణశ్రీ దంపతుల కుమారుడు తాళ్ల అజయ్‌కి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. మాజీ చరిత్ర విభాగాధిపతి, మాజీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, సోషల్ సైన్స్ డీన్, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ఆర్కియాలజీ మ్యూజియం, హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్, రిటైర్డ్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి పర్యవేక్షణలో "తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర (1956-2014)" అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తి చేశారు. పరిశోధనలో భాగంగా జాతీయ ఫెలోషిప్ ఐసీఎస్‌ఎస్‌ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్)కి ఎంపికై డాక్టోరల్ ఫెలోగా పరిశోధన చేస్తూ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆయన విద్యార్థి సంఘాల నాయకుడిగా పలు ఉద్యమాల్లో పాల్గొని, సామాజిక వర్గాల చైతన్యం కోసం కృషి చేశారు.